
సాక్షి ఒడిశా
బుధవారం । 7 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,95,643లు, వెండి 39గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రైల్వేస్టేషన్‌లో కవాతు

రైల్వేస్టేషన్‌లో రక్షణ దళాలు కవాతు నిర్వహించాయి. భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించాయి. - 8లో



లోయలో పడిన ట్రక్కు

మోహన వద్ద జొన్నల ట్రక్కు లోయలో పడింది. డ్రైవర్ గాయాలతో బయటపడ్డాడు. - 8లో

పూరీ చేరిన ఎన్‌ఎస్‌జీ బృందం

భువనేశ్వర్: నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జీ) బృందం మంగళవారం పూరీ చేరింది. శ్రీ మందిరం పాలక వర్గం, జిల్లా పోలీసు యంత్రాంగంతో ఈ బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ప్రధానంగా శ్రీ జగన్నాథ ఆలయ భద్రతపై ఈ వర్గాలు చేపడుతున్న భద్రతా చర్యల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. పూరీ పోలీసులు గతంలో ఆలయ భద్రతపై కీలక సమావేశాలు నిర్వహించగా, పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఆలయంలో భద్రతను కట్టుదిట్టం చేయడంపై పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు, ఎన్‌ఎస్‌జీ బృందం మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో స్వామి రథయాత్ర దగ్గర పడుతున్న తరుణంలో మందిరం భద్రతకు అన్ని విధాలా పటిష్టమైన చర్యలు చేపట్టడంపై అనుబంధ యంత్రాంగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. పూరీ శ్రీ జగన్నాథ మందిరంపై ఉగ్రవాదుల కన్నుపడినట్లు సమాచారం ఉంది. అందువల్ల పూరీలో భద్రతను కట్టుదిట్టం చేయడం అత్యంత అనివార్యం. ఒక వైపు పహల్‌గామ్ ఉగ్రవాద దాడి మరో వైపు శ్రీ జగన్నాథుని రథయాత్ర దగ్గర పడుతున్న తరుణంలో భద్రతా వ్యవస్థని జాతీయ భద్రతా బృందం ప్రత్యక్షంగా సందర్శించి పర్యవేక్షించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ దిశలో రాష్ట్రంల 12 చోట్ల మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణం, శ్రీ మందిరం సందర్శించే సందర్శకులను రక్షించడానికి అధునాతన రక్షణ చర్యలను అన్వేషిస్తుంది. భద్రత, రక్షణ వ్యవస్థలో లోటుపాట్లను నిస్సంకోచంగా గుర్తించి పటిష్టపరిచే దృక్పథంతో జాతీయ భద్రతా వర్గం క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత భద్రతా మౌలిక సదుపాయాలను ఈ బృందం నిశితంగా పరిశీలిస్తోందని సన్నిహిత వర్గాల సమాచారం. పూరీ జగన్నాథ ఆలయంలో భద్రతా ఏర్పాట్లను జాతీయ భద్రతా బృందం సమీక్షించిందని పూరీ ఎస్పీ వినిత్ అగర్వాల్ తెలిపారు. శ్రీ జగన్నాథ ఆలయం, వారసత్వ ప్రాకారం, ఆలయం పరిధిలో ఉన్న నగరంలోని ఇతర ప్రాంతాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతానికి నిర్దిష్ట ఉగ్రవాద ముప్పు సమాచారం లేదని తెలిపారు. ఏదైనా పరిస్థితిని ఎదుర్కోవడానికి తాము అన్ని సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.



పూరీ శ్రీ మందిరం పరిసరాల్లో భద్రతా వ్యవస్థ పటిష్టతని ప్రత్యక్షంగా సమీక్షిస్తున్న జాతీయ భద్రతా బృందం



పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటుతో ఎన్‌ఎస్‌జీ అధికారుల చర్చ

సమితి కార్యాలయానికి తాళం!



చందాహండి బీడీఓ కార్యాలయం ముందు బైఠాయించిన ప్రజలు

• బీడీఓ పోస్టు భర్తీ చేయలేదని ప్రజల నిరసన

కొరాపుట్: ఖాళీగా ఉన్న బీడీవో పోస్టును భర్తీ చేయనందుకు నిరసనగా సమితి కార్యాలయానికి ప్రజలు తాళం వేశారు. ఈ సంఘటన నబరంగ్‌పూర్ జిల్లా చందాహండిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎనిమిది నెలలుగా సమితి కార్యాలయంలో బీడీవో పోస్టు ఖాళీగా ఉంది. దీన్ని భర్తీ చేయాలని పలుమార్లు స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బీడీవో లేకపోవడంతో అభివృద్ధి పడకేసిందని స్థానికులు ఆందోళన చెందారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం కార్యాలయాన్ని సిబ్బంది తెరవగా.. గ్రామస్తులు వెళ్లి వారిని బయటకు పంపించేసి తాళాలు వేసి.. బైఠాయించి నిరసన తెలియజేశారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

జయపురం: స్థానిక విక్రమదేవ్ వర్మ విశ్వవిద్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ బిజినెస్ ఎన్విరాన్మెంట్ మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు సర్టిఫికెట్ల ప్రదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ కామర్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ డాక్టర్ దేవదత్త ఇండోరియ అద్భుతంగా డిజైన్ చేశారని వక్తలు ప్రశంసించారు. ఆన్‌లైన్ కోర్సులో 50 మంది యూనివర్సిటీ కామర్స్ పీజీ విద్యార్థులు చేరారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కోర్సులో వీడియో ప్రసంగాలు, స్టడీ మెటీరియల్స్, అసైన్‌మెంట్స్ చేర్చి గ్లోబల్ బిజినెస్ వాతావరణంపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తామన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

చందాహండిలో ఆధ్యాత్మిక సందడి



అలేఖ్ మత గురువులతో మాజీ ఎంపీ రమేష్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కేంద్రంలో మంగళవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అలేఖ్ బాబా మత గురువులతో బీజేడీ పార్టీకి చెందిన నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మత గురువులు భారీ యజ్ఞాన్ని నిర్వహించారు. అలేఖ్ బాబా మత గురువుల ఆహ్వానం మేరకు రమేష్ హాజరై మాట్లాడారు. గతంలో అదే ప్రాంతం నుంచి రమేష్ తండ్రి జాదవ మజ్జి, తమ్ముడు ప్రకాష్ మజ్జిలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వారి కుటుంబం అలేఖ్ బాబా మతస్తులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు.

గాయపడిన జర్నలిస్టు మృతి



రాజీవ్ లొచన్ పండ (ఫైల్)

రాయగడ: స్థానిక రింగ్ రోడ్డు సమీపంలోని మంగళా మందిరం వద్ద నివసిస్తున్న ప్రముఖ జర్నలిస్ట్ రాజీవ్ లొచన్ పండ (27) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన గత నెల 30వ తేదీన వాహనంపై రాయగడ నుంచి కొలనార ప్రాంతానికి పనిపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తలకు తీవ్రగాయమైంది. అప్పటి నుంచి రాజధాని భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పండ మృతిపై పలువురు జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

• కుమారుడికి గాయాలు

జయపురం: గుప్తేశ్వర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృత్యువాత పడగా, కుమారుడికి గాయాలయ్యాయి. మృతి చెందిన వ్యక్తి దశమంతపూర్ సమితి కావుగుడ గ్రామానికి చెందిన ధనుర్జయ గదబ(55) కాగా, అతడి కుమారుడు భుభణ గదబకు తీవ్రగాయాలయ్యాయి. సోమవారం వీరు ఒక బైక్‌పై జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలోని ప్రసిద్ధ శివక్షేత్రం దర్శించేందుకు వెళ్లారు. వీరు వెళ్తున్న సమయంలో మధ్యాహ్నం రామగిరి గ్రామ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ధనుర్జయ్, భుభణలు రోడ్డుపైకి ఎగిరిపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు కాల్‌చేసి, గాయపడినవారిని చికిత్స కోసం కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ధనుర్జయ మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. ఈ ప్రమాద సమాచారం తెలిసిన రామగిరి పోలీసు పంటి పోలీసు అధికారి ఏఎస్‌ఐ విష్ణు మడకామి సంఘటనా ప్రాంతానికి వెళ్లి రెండు బైక్‌లను సీజ్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

యువతి ఆత్మహత్య



జయంతి (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పోటేరు గ్రామంలో మంగళవారం ఉదయం జయంతి హల్దార్(20) అనే యువతి తన గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పోటేర్ గ్రామంలో పోలీసుస్టేషన్ ఎదురుగా టీ దుకాణం నడుపుతున్న తాపసీ హల్దార్ అనే మహిళ తన కుమార్తె జయంతి హల్దార్‌తో నివసిస్తోంది. తాపసీ భర్త జయంతి చిన్నతనంలోనే ఇల్లు వదిలి అరబ్ దేశాలకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బిడ్డకు అన్నీ తానై చదివించింది. అయితే సోమవారం రాత్రి తల్లీకూతుళ్లు భోజనాలు చేసి ఎవరి గదిలో వారు పడుకున్నారు. మంగళవారం ఉదయం తల్లి తపసీ జయంతిని లేపేందుకు తన గదికి వెళ్లి తలుపు తీసింది. అయితే అప్పటికే జయంతి ఉరికి వేలాడుతూ కన్పించింది. దీంతో పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

డ్రాపౌట్స్ గుర్తింపుపై సర్వే

జయపురం: డ్రాపౌట్స్, బడికి వెళ్లని పిల్లల గుర్తింపు సర్వే (చైల్డ్ ట్రాకింగ్) జయపురంలో మంగళవారం ప్రారంభమైంది. 18 ఏళ్ల వయసులోపు వారికి విద్యపై చైతన్యం కలిగించేందుకు చైల్డ్ ట్రాకింగ్ సర్వే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశించటంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి సర్వేను ప్రారంభించారు. జయపురంలో సర్వే ఎలా జరుగుతుందో పరిశీలించేందుకు కొరాపుట్ జిల్లా విద్యాధికారి ప్రశాంత కుమార్ మహంతి మంగళవారం జయపురంలో సమీక్షించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి వెళ్లి సర్వే జరుపుతున్నారు. పట్టణంలో పయిలా సాహి, డెప్పిగుడ, జైల్ రోడ్డు ప్రాంతాల్లో ఉపాధ్యాయులు సర్వే చేయగా.. విద్యాధికారి పరిశీలించారు. మధ్యలో చదువు మానేసిన డ్రాపౌట్లను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. సమీక్ష జరిపిన విద్యాధికారితో పాటు ఏబీవో కైలాసచంద్ర శతపతి, ధన్‌పూర్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఓం ప్రకాశ్ మిశ్ర పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

ఎస్పీ చొరవతో గ్రామాలకు వలస కార్మికులు



లక్ష్మీకద్రక



బినతి సికక



అజిత్ సికక

రాయగడ: జిల్లాకు చెందిన ముగ్గురు వలస కార్మికులు ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ చొరవతో స్వగ్రామాలకు చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నియమగిరి పర్వత ప్రాంతాల్లోని దండమతి, కన్‌సూర్, పతలంబ గ్రామాలకు చెందిన అజిత్ సికక, లక్ష్మీ కద్రక, బినతి సికక అనే ముగ్గురు యువతీ, యువకులు కుటుంబ పోషణ కోసం తమిళనాడులోని కోయంబత్తూరుకు పదిహేను రోజుల క్రితం వెళ్లారు. అక్కడ ఒక వస్త్రాల దుకాణంలో పనికి చేరారు. అయితే కొద్ది రోజుల తర్వాత వారికి అక్కడ పనులు నచ్చకపోవడంతో పాటు రోజువారీ కూలి డబ్బులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో తాము ఇక ఈ కంపెనీలో పనిచేసేది లేదని, తమకు రావాల్సిన కూలి డబ్బులు ఇస్తే స్వగ్రామానికి తిరిగి వెళ్లిపోతామని యజమానికి చెప్పారు. అయితే అందుకు ససేమిరా యజమాని అంగీకరించకపోవడంతో పాటు వారు పనులు చేయాల్సిందేనని చెప్పేవాడు. రోజురోజుకూ పడుతున్న నరకయాతనను భరించలేని అజిత్ సికక రాయగడలోని ప్రముఖ జర్నలిస్టు బాదల్ కుమార్ థాకు ఫోన్‌చేసి తమ ఇబ్బందులను తెలియజేశాడు. దీంతో స్పందించిన బాదల్ థా జిల్లా ఎస్పీ, కలెక్టర్, జిల్లా కార్మిక శాఖ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ కొయంబత్తూరులోని కార్మిక శాఖ అధికారులతో చర్చించిన అనంతరం అక్కడ ఉన్నటువంటి ముగ్గురు వలస కార్మికులు సోమవారం తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారంతా జిల్లా యంత్రాంగానికి, ప్రత్యేకంగా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

విశాఖకు నిత్య విమానయాన సౌకర్యం

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విశాఖపట్నం ప్రాంతానికి నిత్యం ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ ఏడాది జూన్ నెల నుంచి భువనేశ్వర్ - విశాఖపట్నం మధ్య రోజువారీ విమానాల రాకపోకలు ప్రారంభం అవుతాయని ముఖ్యమంత్రి కార్యాలయం వర్గాల సమాచారం. బీ-మాన్ కార్యక్రమం కింద ఈ సౌలభ్యం కల్పించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కృతజ్ఞతలు తెలిపారు.

సుభద్ర యోజన జాబితాలో అవకతవకలు

జయపురం: నిరుపేద మహిళలకు ఆర్థిక సౌలభ్యం కోసం ప్రవేశ పెట్టిన సుభద్ర పథకం జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయి. సుభద్ర పథకంలో ప్రతి మహిళకు ఐదేళ్లలో రూ.50వేలు అందజేస్తారు. ప్రతి ఆరు నెలలకు రూ.5వేలు చొప్పున వారి ఖాతాలో జమ చేస్తారు. మొదటిసారి అందరికీ జమ చేశారు. రెండోసారి కొందరికి డబ్బులు పడలేదు. దీంతో వారంతా సీడీపీఓ కాంచన పండాను కలిసి సమస్య వివరించారు. ఆన్‌లైన్‌లో వారంతా మరణించినట్లు నమోదు కావడంతో డబ్బు పడలేదని చెప్పడంతో వారంతా నిశ్చేష్టులయ్యారు. దాదాపు ఆరుగురు లబ్ధిదారులది ఇదే పరిస్థితి. వారంతా సీడీపీఓను నిలదీశారు. బీజేపీ యువనేత రవీంద్ర మహాపాత్ర వచ్చి విషయం తెలుసుకొని పీడబ్ల్యూఓను నిలదీశారు. ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుందని, దర్యాప్తు చేసి లబ్ధిదారులకు న్యాయం చేస్తానని మాటిచ్చారు.

గోమతి కృష్ణుడు..



గోమతి కృష్ణుని అలంకారంలో మదన మోహనుడు

భువనేశ్వర్: పవిత్ర వైశాఖ శుక్ల పక్ష సప్తమి తిథి పురస్కరించుకుని మదన మోహనుడు గోమతీ కృష్ణ అలంకరణలో కళకళలాడాడు. చందన్ యాత్ర ఏడో రోజు సందర్భంగా నరేంద్ర సరోవరం ఉత్సవ వేదికపై గోమతీ కృష్ణ రూపంలో శ్రీజగన్నాథుని ప్రతినిధి మదన మోహనుడుని దర్శించి భక్తులు తరించారు.

బొరిగుమ్మలో విద్యార్థుల ఆందోళన



ర్యాలీ జరుపుతున్న విద్యార్థినులు



యాజమాన్య చిత్రాలను దగ్ధం చేస్తున్న దృశ్యం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. మంగళవారం బీజేపీకి చెందిన అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. భువనేశ్వర్‌లోని కిట్ యునివర్సిటీలో వరుసగా నేపాలీ విద్యార్థుల ఆత్మహత్యలపై నిరసన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటిలో 933 కిలోల గంజాయి



మాచ్‌ఖండ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కొరాపుట్: ఇంట్లో నిల్వ ఉంచిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీస్ సబ్ డివిజన్ మాచ్‌ఖండ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంకిచాబ్ గ్రామానికి చెందిన దనమండి అనే వ్యక్తి ఇంట్లో గంజాయి ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే దాడులు జరపగా 933 కిలోల గంజాయి పట్టుబడినట్లు నందపూర్ ఎస్‌డీపీఓ దేవేంద్ర మాలిక్ ప్రకటించారు. తహసీల్దార్ సమక్షంలో సీజ్ చేసి నిందితుడిని కోర్టుకి తరలించారు.

వారం రోజులు పౌర రక్షణ మాక్ డ్రిల్

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7 నుంచి వారం రోజుల పాటు పౌర రక్షణ (సివిల్ డిఫెన్సు) విన్యాసాలు నిర్వహించనుంది. అగ్ని మాపక శాఖ డైరెక్టర్ జనరల్ సుధాంశు షడంగి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. పహల్‌గాం ఉగ్రవాది దాడుల అనంతరం ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో వైమానిక దాడులకు పౌరులను సిద్ధం చేయడం మాక్ డ్రిల్ లక్ష్యంగా నడుం బిగించారు. సాధారణ పౌరులను అప్రమత్తం చేసేందుకు మాక్ డ్రిల్ నిర్వహణ ఆరంభం, ముగింపు సందర్భాల్లో 12 జిల్లాల్లో సైరన్లు మోగుతాయని డైరెక్టరు జనరల్ తెలిపారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత జాతీయ భద్రతా ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఈ పరిస్థితుల్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత అధికారులు పెద్ద ఎత్తున సన్నద్ధత చర్యలు ప్రారంభించారు. అప్రమత్తతలో భాగంగా ముఖ్యంగా వైమానిక దాడి జరిగినప్పుడు అత్యవసర పరిస్థితులకు పౌరులను సన్నద్ధం చేయడానికి దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్‌లు ఈ నెల 7 బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విపత్తు నిర్వహణ అధికారులు, అగ్నిమాపక సేవల యంత్రాంగంతో ఇతర కీలక సంస్థలు సమన్వయంతో ఈ కసరత్తుకు సిద్ధం అయ్యాయి.



అగ్నిమాపక విభాగం మాక్ డ్రిల్ సన్నద్ధత సమావేశం

మాక్ డ్రిల్ సన్నాహాలు

రాష్ట్రంలో ఈ మాక్ డ్రిల్ తొలి దశ తీరప్రాంత జిల్లాలు, పట్టణ మండలాల్లో ప్రారంభం అవుతుంది. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. డ్రిల్ ప్రారంభానికి సంకేతంగా దాదాపు 5 నిమిషాల పాటు సైరన్ మోగుతుందని ఒడిశా అగ్నిమాపక డైరెక్టర్ జనరల్ సుధాంశు షడంగి తెలిపారు. మాక్ డ్రిల్ పూర్తయిన తర్వాత మరొక సైరన్ ద్వారా కసరత్తు ముగిసిందని పౌరులకు తెలియజేస్తామని ఆయన అన్నారు. దశలవారీగా ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎంపిక చేసిన జిల్లాల్లో ఒక వారం రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు.

నేడు రాష్ట్రంలో మాక్ డ్రిల్

భువనేశ్వర్: కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఈ నెల 7న మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. దేశంలో రక్షణ అత్యవసర పరిస్థితికి ప్రతిస్పందనగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలను మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించింది. పహల్గామ్ దాడి తర్వాత భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల మధ్య 12 వ్యూహాత్మక ప్రదేశాలలో మాక్ డ్రిల్‌లను ప్రకటించింది. పౌర రక్షణ సన్నద్ధతను పెంచడం దీని లక్ష్యం. రాష్ట్రంలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన 12 ప్రదేశాలలో మాక్ డ్రిల్ నిర్వహించాలని నిర్ణయించడం విశేషం. వీటిలో బాలాసోర్‌లోని చాందీపూర్‌లో ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) పరీక్ష కేంద్రం ఒకటి. ధామ్రాలోని అబ్దుల్ కలాం వీలర్ ద్వీపం, సునాబెడాలో మిగ్ ఫ్యాక్టరీ, రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ వంటి అనేక ప్రాంతాలు వ్యూహాత్మకంగా సున్నితమైనవిగా గుర్తించారు. తాల్చేర్, పారాదీప్, బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, భువనేశ్వర్, రౌర్కెలా, జగత్‌సింగ్‌పూర్, కొరాపుట్, హిరాకుద్, గోపాల్‌పూర్, ఢెంకనాల్ 12 చోట్ల మాక్ డ్రిల్‌లు నిర్వహించనున్నారు. వైమానిక దాడి హెచ్చరిక సైరన్‌లను అమలు చేయడం, శత్రు దాడి జరిగినప్పుడు తమను తాము రక్షించుకోవడానికి పౌర రక్షణ అంశాలపై పౌరులు, విద్యార్థులు మొదలైన వారికి శిక్షణ ఇవ్వడం వంటివి చేపట్టడం ఈ మాక్ డ్రిల్ లక్ష్యంగా పేర్కొన్నారు.

రక్షణ మంత్రిత్వ శాఖ వర్గీకరణ ప్రకారం తొలి వర్గంలో తాల్చేర్ పౌర రక్షణ (సివిల్ డిఫెన్సు) జిల్లా చోటు చేసుకుంది. 2వ వర్గంలో బాలాసోర్, కొరాపుట్, భువనేశ్వర్, గోపాల్‌పూర్, హిరాకుద్, రౌర్కెలా, పారాదీప్ , 3వ వర్గంలో భద్రక్, ఢెంకనాల్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా పౌర రక్షణ జిల్లాలుగా గుర్తించారు. ఉద్రిక్తతలు ఎక్కువగా ఉన్నందున ప్రమాదాలను నిరోధించే చర్యల్లో భాగంగా ఏదైనా సంఘటనకు సిద్ధంగా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని ఒక అభ్యాస అవకాశంగా పరిగణించి పౌరులు పూర్తిగా సహకరించేందుకు ప్రోత్సహిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని నివాసితులకు ముందస్తు నోటిఫికేషన్లు అందుతాయి. వైమానిక దాడులు, బ్లాక్‌అవుట్ పరిస్థితులు, తరలింపు ప్రోటోకాల్‌లు , అత్యవసర సహాయ కార్యకలాపాలను అనుకరించే మాక్ దృశ్యాలతో రాష్ట్రంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తారు.



రంగంలోకి దిగిన పోలీసు యంత్రాంగం

క్లుప్తంగా

ప్రశాంతంగా ఏపీ ఈసెట్



శివానీ కేంద్రంలో హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమో అనంతరం ఇంజినీరింగ్ రెండో ఏడాది లేటరల్ ఎంట్రీకి సంబంధించిన ఏపీ ఈసెట్– 2025 పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. చిలకపాలేంలో శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్టులో 250 మందికి 245 మంది, రెండో షిఫ్టులో 186 మందికి 180 మంది హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో ఒకే షిఫ్టులో 160 మందికి 157 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. సెట్ నిర్వాహకులు పర్యవేక్షించారు .

యువకుడు ఆత్మహత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు: హిరమండలం మండలం శుభలాయి గ్రామానికి చెందిన అవివాహితుడు పిన్నింటి నగేష్(22) మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగేష్ చెడు వ్యసనాలకు బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కొత్తూరు వచ్చేసి బీసీ బాలుర వసతి గృహం సమీపంలో టేకు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న సీఐ సీహెచ్ ప్రసాదరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు పిన్నింటి జోగారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ ఎండీ యాసిన్ తెలిపారు.

ఐదుగురు జేఎల్స్‌కు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా నుంచి ప్రిన్సిపాళ్లుగా ఐదుగురు జూనియర్ లెక్చరర్లకు పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా ప్రొసీడింగ్స్ వెలువరించారు. వీరంతా ఏపీపీఎస్సీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జేఎల్స్‌గా నియామకమైనవారు కావడం విశేషం. ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందనున్న వారిలో టి.జగదీశ్వరరావు (జీజేసీ శ్రీకాకుళం బాలురు– బోటనీ), పి.శైలజ (జీజేసీ శ్రీకాకుళం బాలికలు– హిస్టరీ), జి.ధనుంజయరావు (జీజేసీ ఆమదాలవలస– బోటనీ), ఎ.అప్పన్న (జీజేసీ నరసన్నపేట– బోటనీ), జి.తిరుపతిరావు (జీజేసీ ఆమదాలవలస– సివిక్స్) ఉన్నారు. త్వరలో వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి జోన్–1 (పునర్విభజనకు పూర్వపు ఉత్తరాంధ్ర జిల్లాలు) పరిధిలో ప్రిన్సిపాళ్లుగా నియమించనున్నారు.

కార్గో ఎయిర్‌పోర్టుతో విధ్వంసం



గేయాలు ఆలపిస్తున్న ప్రజా కళాకారులు

మందస: పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టుతో విధ్వంసం సృష్టించవద్దని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మందస మండలం రాంపురం, గంగువాడ గ్రామాల్లో కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు పిలుపుమేరకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు, ప్రజా కళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవి, రంగం కళాకారులు కోనారి సూదన్ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ప్రజామోదానికి విరుద్ధంగా పాలకులు వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చపర వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, ఉప కార్యదర్శి వంకల మాధవరావు, వై.యస్.ఆర్.ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్, లోకనాథం , రైతాంగ జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరుడు అరెస్టు

సోంపేట: సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగిలించిన ఒడిశాకు చెందిన యువకుడు అమిత్‌కుమార్ పాత్రోను సోంపేట పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో సోంపేట నెక్స్‌లెవల్ బైక్ గ్యారెజీ వద్ద అమిత్ కుమార్‌ను విచారించగా ఏడు ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు అంగీకరించాడు. వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సోంపేట ఎస్‌ఐ బి.లోవరాజు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిని సీఐ బి.మంగరాజు అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో రక్షణ దళం కవాతు



భువనేశ్వర్ రైల్వే స్టేషన్ ప్రాంగణాల్లో రైల్వే రక్షక దళం కవాతు

భువనేశ్వర్: భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎక్కడికక్కడ భద్రత, రక్షణ కార్యకలాపాల్ని పటిష్టపరుస్తున్నారు. ప్రధానంగా జన సందోహిత కూడళ్లు రైల్వే స్టేషను వంటి ప్రాంగణాల్లో రక్షక దళాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక రైల్వే స్టేషనులో రక్షక దళం జవాన్లు కార్యకలాపాలు ముమ్మరం చేశారు. భువనేశ్వర్ రైల్వే స్టేషన్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది మంగళవారం ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి, కీలకమైన రవాణా కేంద్రంలో నిఘాను పెంచడానికి విస్తృత భద్రతా కసరత్తు, ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

తనిఖీలు ముమ్మరం

స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారంలు, వేచి ఉండే ప్రాంతాలు, ప్రవేశం, నిష్క్రమణ కేంద్రాల్లో ఆర్పీఎఫ్ బృందం క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా పడి ఉన్న లగేజి తదితర అనుమానాస్పద పరిస్థితులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. పహల్గామ్ సంఘటన తర్వాత ఈ చర్యల్ని ముమ్మరం చేశారు.

నా భర్త ఆచూకీ కనుక్కోండి

- కార్మికశాఖ అధికారులకు మహిళ విజ్ఞప్తి



కార్మికశాఖ అధికారులను కలిసి కుటుంబీకులు

రాయగడ: బతుకు తెరువు కోసం వలస వెళ్లిన తన భర్త ఇంటికి తిరిగి రాలేదని.. అతని ఆచూకీ కనుక్కోవాలని భార్య సింగారి హికక కోరారు. ఈ మేరకు జిల్లా కార్మిక శాఖ అధికారులను మంగళవారం కలిసి మొరపెట్టుకున్నారు. ఈ మేరకు వినతి పత్రాన్ని జిల్లా కార్మికశాఖ అధికారికి సమర్పించారు. జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి ధమినిపాంగ పంచాయతీలోని హతిముండా గ్రామానికి చెందిన అభి హుయిక, రాజీవ్‌లొచన్ గురు, బాడు నారాయణ, జగ్గు కద్రకలతో సహా తన భర్త జెన్న హికక ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా సామర్లకోట సమీపంలోని యానాం ప్రాంతానికి పనుల నిమిత్తం వెళ్లారని కార్మిక శాఖ అధికారులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంట్రాక్టర్ మహేష్ కుమార్ సహాయంతో వీరంతా పిల్లర్ల పనుల్లో చేరినట్టు పేర్కొన్నారు. రాజీవ్‌లొచన్ గురు, బాడు నారాయణ, జగ్గు కద్రక, అభి హుయికలు చేస్తున్న పిల్లర్లకు సంబంధించిన పనులు ముగింపు దశకు రావడంతో వారికి ఇవ్వాల్సిన కూలి డబ్బులను కాంట్రాక్టర్ చెల్లించి ఇంటికి పంపించారు. అయితే తనభర్త ఇంటికి తిరిగి రాలేదని కాంట్రాక్టర్‌కు ఫొన్ ద్వారా మాట్లాడిన సింగారి మరి కొద్ది రోజులు పనులు ఉంటాయని ఆ పనులు ముగిసిన తరువాత అతనిని తిరిగి పంపిస్తామని సమాధానం చెప్పాడని వినతిపత్రంలో వివరించారు. అయితే రోజులు గడుస్తున్నా తన భర్త ఇంకా ఇంటికి చేరకపోవడంతో పాటు కాంట్రాక్టరును సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆందోళనగా ఉందన్నారు. తన భర్త ఆచూకీని కనుక్కోని న్యాయం చేయాలని వేడుకున్నారు. దర్యాప్తు చేపట్టి వివరాలు సేకరించి ఆచూకీ తెలియజేస్తామని కార్మిక శాఖ అధికారులు ధైర్యం చెప్పారు.

880 లీటర్ల నాటుసారా స్వాధీనం



పట్టుబడిన సారా, తయారీకి వినియోగించే సామాన్లు

రాయగడ: ఒడిశా–ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలైన శశిఖాల్, పోలీస్ స్టేషన్ పరిధిలోని అనిజ, సులవ, బొడొహలువ, కెరడ ప్రాంతాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో 880 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోగా.. 11,100 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపిన ఎక్సైజ్ శాఖ ఈ మేరకు విస్తృతంగా దాడులను నిర్వహిస్తుంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలు ఎక్కువవుతున్నాయని ఇక్కడ తయారీ చేసిన నాటుసారాను అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు ఈ దాడులను తరచూ నిర్వహిస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.

వడ్డీలు కట్టలేకపోతున్నా..



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న తిరుపతిరావు

శ్రీకాకుళం క్రైమ్ : 'రోజూ రూ.లక్షల్లో వడ్డీలు కట్టలేకపోతున్నా.. వేధింపులు భరించలేకపోతున్నా.. చచ్చిపోతానో.. బతుకుతానో.. నాకే తెలియదు' అంటూ ఓ వ్యక్తి తన భార్యకు జాగ్రత్తలు చెబుతూ విడుదల చేసిన సెల్ఫీ వీడియో జిల్లా కేంద్రంలో మంగళవారం హల్‌చల్ చేసింది. ఆటోలో వెళ్తూ శనివారం ఈ సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇతను జలుమూరు మండలం బొడ్డపాడుకు చెందిన అంపోలు తిరుపతిరావుగా గుర్తించారు. పదేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉండేవాడు. గత పంచాయతీ ఎన్నికల్లో ఈయన భార్య భాను సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తిరుపతిరావు కొంతకాలంగా భార్యతో కలసి శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న తెలిసింది. కాగా, రమణమూర్తి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఇదే విషయమై శ్రీకాకుళం పట్టణ, రూరల్ సీఐలు పి.ఈశ్వరరావు, సీహెచ్ పైడపునాయుడుల వద్ద ప్రస్తావించగా తమకు ఇంత వరకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

టెన్త్ టాపర్లకు సత్కారం



జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన దానీయల్ లెంక, దోంబుర్ లెంక అన్నదమ్ములను అభినందిస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా యంత్రాంగం తరఫున మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ టెన్త్ టాపర్లను సత్కరించారు. 12 మందిని సన్మానించారు. ఉపాధ్యాయులను కూడా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్, జిల్లా విద్యా శాఖ అధికారి ఉమాప్రసాద్ దాస్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎ–1 గ్రేడ్ లో విజయం సాధించిన విద్యార్థులకు షీల్డులు అందజేసిన దృశ్యం

వ్యాన్ ఢీకొని యువకుడు మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

జి.సిగడాం: మండలంలోని ఉల్లివలస సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా మొరకముడిదాం మండలం పూతికవలస గ్రామానికి చెందిన గురాన అప్పలనాయుడు (37) మృతిచెందాడు. అప్పలనాయుడు చీపురుపల్లి నుంచి పూతికవలస వెళ్తున్న సమయంలో రాజాం మండలం కోతారిపురం నుంచి వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

అంతన్నారు.. ఇంతన్నారు!

- ఎన్నికల వేళ అరచేతిలో వైకుంఠం చూపిన కూటమి నేతలు
- గద్దెనెక్కాక ఉద్యోగుల సమస్యలు గాలికొదిలేసిన సర్కారు
- ఐఆర్, పీఆర్‌సీ, పెండింగ్ డీఏల ఊసెత్తని ప్రభుత్వం



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)



శ్రీకాకుళం:

ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం దగా చేసింది. ఎన్నికల సందర్భంలో అనేక హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిన కూటమి నేతలు.. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఉద్యోగులు, పెన్షనర్లుకు ఐదో తేదీలోగా జీతాలు, పెన్షన్లు ఇవ్వడం మినహా మరేవిధమైనా ఆర్థిక ప్రయోజనం చేకూర్చలేదు. ప్రభుత్వం ఇప్పటివరకు విడుదల చేసిన నిధుల్లో రూ.2300 కోట్లు వరకు సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంటుకే సరిపోయింది. మిగిలిన నిధుల్లో పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, పీఎల్‌ఎస్‌లు విడుదల చేయడం తప్ప ఐఆర్, పీఆర్‌సీల ఊసెత్తిన దాఖలాలు లేవు. ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆర్థిక ప్రయోజనాలను కూడా మంజూరు చేయడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో సుమారు వెయ్యి మంది వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారు. వారిలో ఏ ఒక్కరికి ఆర్థిక ప్రయోజనాలు చెల్లించలేదు. వీరందరికీ గ్రాట్యుటీ, కమిటేషన్ ఆర్జిత ఈఎల్స్‌లు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. పదవీ విరమణ చేసిన ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షలు నుంచి రూ.50 లక్షలు వరకు బకాయిలున్నాయి. ప్రభుత్వం ఏర్పడ్డాక మూడు డీఏలను మంజూరు చేయాల్సి ఉండగా వాటినీ గాలికొదిలేశారు. ఇలా ఏ ఒక్క ప్రయోజనాన్ని చేకూర్చకపోవడంతో మరోసారి చంద్రబాబు మాటలకు దగా పడ్డామని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు వాపోతున్నారు.

సీపీఎస్ సంగతేంటి..?

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకువస్తామని కూటమి నేతలు ఎన్నికల సందర్భంలో ప్రగల్భాలు పలికారు. వీటిని నమ్మిన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల్లో కూటమి విజయానికి తమ వంతు 'సహకారం' అందించారు. గెలిచాక కూటమి నేతలు సీపీఎస్ ఉద్యోగుల ముఖమే చూడటం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా ఓపీఎస్ అమలు చేయడం అసాధ్యమని, వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రవేశపెట్టిన సీపీఎస్ అమలుకు పరిశీలన చేస్తున్నామని చెప్పటం గమనార్హం. ఓపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పిన కొన్ని రాష్ట్రాలు కూడా అది సాధ్యం కాదని భావించి సీపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పడం విశేషం. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో కూటమి తరఫున కార్యకర్తల్లా పనిచేసిన సీపీఎస్ పోరాట కమిటీ నాయకులు, సభ్యులు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. కూటమి నేతలకంటే జగన్‌మోహన్‌రెడ్డి నయమన్న విషయాన్ని ఇప్పుడు గుర్తించినా చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజనం లేదన్న నిర్ణయానికొచ్చారు. మొత్తమ్మీద కూటమి ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల వర్గం తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కుతోంది.

త్వరలోనే ఆందోళన బాట



ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే విడతల వారీగా ఆందోళన చేపట్టాం. త్వరలోనే ప్రత్యక్ష ఆందోళనకు దిగాలని నిర్ణయించాం. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి.

– గొంటి గిరిధర్, యూటీఎఫ్ నాయకుడు

డీఏలు ఎక్కడ?



కూటమి నేతలు పాత బకాయిలను తీర్చేస్తామని ఆర్థిక ప్రయోజనాలను ఎప్పటికప్పుడు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారు. వాటిని నమ్మి మోసపోయాం. పాతవి ఇవ్వకపోగా మూడు డీఏలు పెండింగ్‌లో పెట్టారు. పీఆర్‌సీ, ఐఆర్ ఊసే లేదు.

– గరుగుబిల్లి రమణ, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మోహన వద్ద లోయలోకి పడిపోయిన జొన్నల ట్రక్కు



మోహన వద్ద గోవిందపూర్ వద్ద లోయలో పడిపోయిన జొన్నల ట్రక్కు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మోహన బ్లాక్ గోవిందపూర్ పంచాయతీ శాంతినగర్ జోరావ్ ఘాటి వద్ద ఈ ఉదయం ఒక జొన్నల ట్రక్కు అదుపు తప్పి 30 అడుగుల లోయలోకి పడిపోయింది. మోహన నుంచి గంజాం జిల్లా బోడోగోడో, సోరడా జొన్నలతో వెళుతున్న ట్రక్కు అదుపుతప్పి 30 అడుగుల లోయలోకి పడిపోవడంతో ట్రక్కు డ్రైవరు జి.పతువా రజి(38)కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు ట్రక్కు డ్రైవరును బయటకు తీశారు. అలాగే ట్రక్కులో ప్రయాణం చేస్తున్న ఒక ప్రయాణికునికి కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ట్రక్కు డ్రైవరు, ప్రయాణికున్ని గంజాం జిల్లా బోడోగోడో మెడికల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బరంపురం యం.కె.సి.జీ.మెడికల్‌కు తీసుకెళ్లారు. ట్రక్కు లోయలోకి పడిపోయినప్పుడు అక్కడే మేత మేస్తున్న ఆవు చనిపోయింది. ఈ దుర్ఘటనపై మోహన పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

ఆస్పత్రి సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ జర్మన్ ఆస్పత్రిని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. జిల్లాస్థాయి ముఖ్య వైద్యాధికారుల బృందంతో తరలి వెళ్లారు. ఆయుష్మాన్ భారత ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, గోపబంధు జన ఆరోగ్య యెజన పథకాలు అమలు తీరు పరిశీలించారు. నేరుగా రోగుల వద్దకు వెళ్లి ఆయా పథకాల ద్వారా పొందుతున్న ఉచిత సహాయాలు అడిగి తెలుసు కున్నారు.కలెక్టర్ ఆకస్మిక రాక తో క్రిష్టియన్ హస్పిటల్ వర్గాలు కలెక్టర్ వివరాలు వెను వెంటనే అందించారు.

పెండ్రాణి అమ్మవారికి మంత్రి పూజలు



పెండ్రాణి దేవాలయం వద్ద మంత్రి నిత్యానంద గోండో, రమేష్ సాహు తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘీక సంక్షేమ, మైనారిటీ, ప్రాథమిక విద్యా శాఖా మంత్రి నిత్యానంద గోండో తన స్వంత నియెజకవర్గం ఉమ్మర్‌కోట్‌లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గులిపట్నలోని పెండ్రాణి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రభుత్వం తరపున మరికొన్ని అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చుతానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. పర్యటనలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ సాహు తదితరులున్నారు.

మాత్తిలిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



నేత్ర పరీక్ష చేస్తున్న డాక్టర్ శాంతిలత

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా మాత్తిలి సమితి కార్యాలయం వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. నేత్రమ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి భువనేశ్వర్‌లోని నేత్రమ్ కంటి ఆస్పత్రి వైద్యులు శాంతిలత నాయక్, లిజరాణి పోరిడా, పాయల్ బెహర, దేవిదుర్గ నాయక్ హాజరయ్యారు. సుమారు వెయ్యిమందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు. మత్తిలి సమితి కార్యాలయ అధికారి అశోక్ కుమార్ మహారణా, మత్తిలి పంచాయతీ సర్పంచ్ కానం రాజ్ నాయక్, మత్తిలి సామాజిక భద్రతా అధికారి సంజయ్ కుమార్ సామల్ పాల్గొన్నారు.

కుమారుడి కళ్లెదుటే తండ్రి దుర్మరణం



మృతి చెందిన సింహాచలం

టెక్కలి: కోటబొమ్మాళి మండలం జర్జంగి సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తున్న జాతీయ రహదారిలో చిప్స్‌లోడుతో వస్తున్న ట్రాక్టర్ శ్రీజగన్నాథపురం వెళ్లేందుకు జర్జంగి జంక్షన్ వద్ద ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా యూటర్న్ తీసుకుంది. అదే రహదారిలో ద్విచక్రవాహనంపై వస్తున్న జలుమూరు మండలం బాచివలస గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు బొడ్డల సింహాచలం (35), జగన్మోహనరావులు ట్రాక్టర్‌ను బలంగా ఢీట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తండ్రీ కొడుకులను 108 సహాయంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సింహాచలం మృతి చెందగా, కుమారుడు జగన్మోహనరావు చికిత్స పొందుతున్నాడు. స్థానిక ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను నట్టేట ముంచిన బాబు



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా రైతులకు పంగనామాలు పెట్టారని ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య దుయ్యబట్టారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే మిన్నగా పెద్ద ఎత్తున రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి దాదాపుగా ఏడాది కావస్తున్నా అమలు చేయలేదని మండిపడ్డారు. మిర్చి, పొగాకు, ధాన్యం తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడం లేదన్నారు. సంక్షోభాలను నియంత్రించాలంటే పోరాటాలే శరణ్యమన్నారు. ఆయనతో పాటు ప్రజా సంఘ నాయకులు ఎస్.మోహన్, జి.సుగుణ ఉన్నారు.

రాజకీయ కక్షతోనే సర్పంచ్ చెక్ పవర్ రద్దు



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు

ఎచ్చెర్ల క్యాంపస్ : వైఎస్సార్ సీపీకి చెందిన బొంతలకోడూరు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు చెక్ పవర్ రాజకీయ కక్షతో తొలగించారని, సమగ్ర విచారణ నిర్వహించి చెక్ పవర్ పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల సమన్వయకర్త గొర్లె కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ సచివాలయం భవనం హైకోర్టు తీర్పుకు లోబడి పాఠశాల ప్రాంగణంలో పనులు నిలిపివేశారని, ఇంజినీరింగ్ అధికారులు ఎంబుక్ రికార్డు మేరకు పంచాయతీ నిధులు రూ.1.80 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. పంచాయతీ నిధులను వ్యక్తిగత దుర్వినియోగం, నిబంధనలకు వ్యతిరేకంగా ఖర్చు చేయలేదని వివరించారు. కూటమి నాయకులు, అధికారులు కుమ్మక్కై చెక్ పవర్ రద్దు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక సంస్థల నిబంధనలు, 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధంగా చెక్ పవర్ రద్దు చేయడం తగదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ డీపీవో ఉత్తర్వులను, నివేదిక అధ్యయనం చేసి థర్డ్ పార్టీ అధికారితో దర్యాప్తు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమాలను అడ్డుకుంటున్నానన్న కక్షతో చెక్ పవర్ రద్దు చేశారని, విచారణ నిర్వహించి న్యాయం చేయాలన్నారు. అక్రమాలు నిరూపిస్తే స్వచ్ఛందంగా సర్పంచ్ బాధ్యతలు నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షులు నేతింటి నీలం, మాజీ సర్పంచ్ నక్క కృష్ణమూర్తి, బొంతలకోడూరు ఎంపీటీసీ మాడుగుల జగదీశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటోబోల్తా: పలువురికి గాయాలు



క్షతగాత్రులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదమరికి గ్రామం నుంచి కారాడవలస గ్రామానికి దినసరి కూలీలతో వెళ్తున్న ఆటో కృష్ణపల్లి గ్రామ శివారు ప్రాంతంలో మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలాల్లోకి వెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు కాగా ఓ యువకుడి కాలికి తీవ్రగాయమైంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి 108 వాహనం చేరుకుని క్షతగాత్రులను పార్వతీపురం కేంద్రాస్పత్రికి తరలించింది. గాయాల పాలైన వారిని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



హరీష్ మృతదేహం

గంట్యాడ: గజపతినగరం మండలం ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన వసాత హరీష్ (30) గంట్యాడ మండలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం మండలంలోని వైఎస్సార్‌నగర్‌లో ఉంటూ అరకులో బీఎస్ఎన్ఎల్ టవర్‌లో హరీష్ పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అధిక మొత్తంలో అప్పులు చేశాడు. అవితీర్చలేనేమోనన్న బెంగతో గంట్యాడ మండలం కొండతామరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న తోటలోకి వెళ్లి సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో గడ్డిమందు తాగేశాడు. పరిస్థితి విషమంగా మారడంతో భార్యకు ఫోన్ చేయగా కుటుంబసభ్యులు చేరుకుని విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 8:20 గంటలకు మృతిచెందాడు. హరీష్‌కు ఏడాది క్రితం వివాహమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

9,500 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న టబ్బులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): నవోదయం 2.0లో భాగంగా మంగళవారం ఒడిశా సిబ్బందితో కలిసి రాయగడ జిల్లాలోని కెరడ, వనజ, సుకవ గ్రామాల పరిధిలో నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడి చేసి 45 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 9,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఈ దాడిలో 460 లీటర్ల సారాను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో విజయనగరం ఈఎస్ఐఎఫ్ సీఐ రామచంద్రకుమార్, సీతానగరం ఎక్సైజ్ సీఐ పద్మావతి తదితరులు పాల్గొన్నారని తెలియజేశారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని మేదరవీధి జంక్షన్ సమీపంలో ఉన్న లక్కీ రెడీమేడ్ వస్త్ర దుకాణంలో మంగళవారం వేకువజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తు వరకు ఉన్న ఈ వస్త్ర దుకాణంలో కింద అంతస్తు పూర్తిగా దగ్ధమవగా మొదటి అంతస్తు పాక్షికంగా ప్రమాదానికి గురైంది. ప్రమాద సమాచారం మేరకు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదానికి సంబంధించి జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు మాట్లాడుతూ ముందుగా ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసి చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా అదుపుచేశామన్నారు. అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తినష్టాన్ని వస్త్ర దుకాణ యజమాని నుంచి బిల్లులను పరిశీలించి అంచనా వేయనున్నట్లు ఆయన తెలిపారు.

సుర్రుమంటున్న సూరీడు..!

- విలవిల్లాడుతున్న వన్యప్రాణులు
- వేసవిలో ఇబ్బందుల్లేకుండా అటవీశాఖ చర్యలు
- అభయారణ్యంలో పుష్కలంగా నీటివసతులు
- జంతువుల కోసం నీటికుంటలు, చెక్‌డ్యామ్‌లు, చెలమలు
- తాగునీటి కోసం గ్రామాలకు రాకుండా అడవిలోనే ఏర్పాట్లు



విజయనగరం పూల్‌బాగ్ ఫారెస్ట్‌లోని సాసర్‌పిట్లో నీరు తాగుతున్న కోతి



పూల్‌బాగ్ ఫారెస్ట్‌లో పక్షుల దప్పిక తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటికుంటలు



పూల్‌బాగ్ కాలనీలో సాసర్‌పిట్‌లో ట్యాంకర్‌తో నీరు నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

వన సంపదపై ప్రజలకు అవగాహన



వేటగాళ్ల నుంచి వన్యప్రాణులను కాపాడుకునేందుకు సమీప అటవీ గ్రామాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 'వన్యప్రాణుల చట్టం -1972' గురించి వివరిస్తున్నాం. వన్యప్రాణులను చంపితే ఎలాంటి శిక్షలు ఉంటాయో తెలియజేస్తున్నాం. అలాగే అటవీ సిబ్బందితో ప్రతినిత్యం పెట్రోలింగ్ చేస్తున్నాం. పటిష్ఠ చర్యలు చేపట్టడంతో వన్యప్రాణులను కాపాడుకోగలుగుతున్నాం. వన్యప్రాణులు తాగునీటికి ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత. ప్రభుత్వం కూడా వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. వేసవిలో వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీశాఖ ద్వారా చేపట్టే చర్యలు చాలా అవసరం. అయితే వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వస్తున్నప్పుడు వేటగాళ్ల బారిన పడుతున్నాయి. కాబట్టి, అటవీశాఖతో పాటు ప్రజలు కూడా వన్యప్రాణులను కాపాడడానికి సహకరించాలి. దాహం కోసం జంతువులు అడవిని వీడి నీటి జాడలు వెతుక్కుంటూ గ్రామాల్లోకి వస్తుంటాయి. ప్రజలు వాటికి హాని తలపెడితే శిక్షార్హులవుతారు. – విజయనగరం జిల్లా అటవీశాఖ అధికారి ఆర్.కొండలరావు

విజయనగరం గంటస్తంభం: ఒకప్పుడు వేసవికాలం మొదలైందంటే అడవిలో జలవనరులన్నీ ఎండిపోయి తాగేందుకు నీరు లేక వన్యప్రాణులు అల్లాడేవి. నీళ్లు తాగేందుకు కొన్ని జంతువులు నదుల దారిపడితే..మరికొన్ని సమీప గ్రామాల వైపు వెళ్లేవి. ఇదే అదునుగా మాటువేసి ఉన్న వేటగాళ్ల ఉచ్చులు, విద్యుత్ కంచెలకు బలయ్యేవి. ఏటా అడవి ప్రాణుల మనుగడ కష్టంగా మారిన నేపథ్యంలో అటవీ శాఖ అడవుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు విజయనగరం జిల్లాలో సుమారు 17,300 హెక్టార్లలో విస్తరించి ఉన్న అభయారణ్యంలో తగినన్ని నీటి వసతులు కల్పించింది. ఎండాకాలంలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అడవి లోపలే చెక్‌డ్యాములు, సాసర్‌పిట్‌లు,చెలమలతో పాటు మినీ,మేజర్ సర్క్యులేషన్ పార్కులు, రాతికట్టడాలు నిర్మించి దప్పిక తీర్చుతోంది. ఇలా అటవీశాఖ చర్యలతో తొమ్మిదేళ్లలో అడవంతా పచ్చబడి దట్టంగా మారి వన్యప్రాణుల సంఖ్య కూడా పెరుగుతోంది.

పెరుగుతున్న అటవీ సంపద

అభయారణ్యం విజయనగరం జిల్లా పరిధిలో 173 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. తొమ్మిదేళ్లుగా చేపడుతున్న చర్యలతో అభయారణ్యం దట్టమైన అడవులకు నిలయంగా మారింది. దీంతో ఏటా వన్యసంపద పెరుగుతోంది. ఇక్కడ అత్యధికంగా అడవి పందులు, ఎనుబోతులతో పాటు ఎలుగుబంట్లు, జింకలు, దున్నలు సంచరిస్తున్నాయి. వాటితో పాటు కోతులు, కొంగలతో పాటు వివిధ రకాలైన పక్షులు ఉన్నాయి. గతంలో ఈ అభయారణ్యంలో వేసవికాలం వచ్చిందంటే నీటి వనరులన్నీ ఎండిపోయేవి. దీంతో వన్యప్రాణులు నదులలో నీటిని తాగేందుకు వచ్చేవి.

విజయనగరం అటవీ విభాగం ఏర్పరిచిన నీటికుంటల వివరాలు..

2021-22 లో రిజర్వ్ అడవిలో నిర్మించిన నీటికుంటలు

సంఖ్య	ప్రదేశం/రిజర్వ్ అడవి	విస్తీర్ణం (కి.మీ)
1	వెదురువాడ-1	3

2025-26 లో రిజర్వ్ అడవిలో నిర్మించేందుకు ప్రతిపాదించిన నీటికుంటల వివరాలు

వ.సంఖ్య	ప్రదేశం / రిజర్వ్ అడవి	విస్తీర్ణం (కి.మీ.)
1	బొబ్బిలి	3
2	మారిక	2
3	దమరసింగి	2
4	వెలగాడ	1
5	షికారుగంజి	2
నీటికుంటలు మొత్తం		10

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి



అప్పలనాయుడు మృతదేహం

మక్కువ: కన్నకూతురు పండగకు కబురు చేయగా, ఆమె పండగ జరుపుకునేందుకు అవసరమైన మేక, సామగ్రి ఆటోలో తరలిస్తూ, ముందు బైక్‌పై ప్రయాణిస్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందాడు. మక్కువ మండలం చెముడు గ్రామం వద్ద మంగళవారం జరిగిన సంఘటనపై మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కలిగి. అప్పలనాయుడు (60) బొబ్బిలి పట్టణం గొల్లపల్లిలో జరుగుతున్న గ్రామ దేవత పండగకు ద్విచక్ర వాహనంపై బయల్దేరి వెళ్తున్నాడు. మక్కువ నుంచి చెముడు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనదారు నిర్లక్ష్యంగా బైక్‌ను నడపడంతో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అప్పలనాయుడు రహదారిపై పడిపోగా తలకు తీవ్ర గాయామై అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పలనాయుడి బైక్‌పై వెనుక కూర్చున్న మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. మృతుడు అప్పలనాయుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించినట్లు ఎస్సై ఎం. వెంకట రమణమూర్తి తెలిపారు.

వీఆర్‌ఓ దుర్మరణం

- మరోవ్యక్తికి తీవ్ర గాయాలు



దెబ్బతగిలిన గొర్లి సురేష్




విజయనంద్ మృతదేహం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని వనిజ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు తమ్ముడు, వీఆర్‌ఓ నిమ్మక విజయానంద్ బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై ప్రాణాలు విడిచారు. వివరాల్లోకి వెళ్తే.. వీరఘట్టం మండలం కత్తుల కవిటి వీఆర్‌ఓగా పనిచేస్తున్న విజయానంద్ స్వస్థలం వనిజ గ్రామం. కొంతకాలంగా పార్వతీపురంలో నివాసం ఉంటూ అక్కడి నుంచి ఉద్యోగానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వనిజ గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం 6.45 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై బయలుదేరారు. తురక నాయుడు వలస-ఇటుక గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై తురక నాయుడు వలస గ్రామానికి చెందిన గొర్లి సురేష్ వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా వెనుక నుంచి విజయానంద్ బైక్‌తో ఢీకొట్టాడు. ప్రమాదంలో పల్సర్ బైక్ హ్యాండిల్‌బార్‌లో విజయానంద్ తల ఇరుక్కుపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనపై సురేష్ తన తమ్ముడికి ఫోన్ చేసి తెలియజేయడంతో తురక నాయుడు వలస నుంచి గ్రామస్తులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని జియ్యమ్మవలస పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ సిబ్బందితో వచ్చి ఘటనపై ఆరా తీశారు. సురేష్‌ను 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించి విజయానంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు విజయానంద్‌కు ఇద్దర భార్యలు భారతి, సునీత, ముగ్గురు కుమార్తెలతో పాటు పోషిత్ అనే కుమారుడు ఉన్నాడు.

అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ మే డే వారోత్సవాల్లో భాగంగా విజయనగరంలోని కార్మికశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికశాఖలో అమలవుతున్న కేంద్రప్రభుత్వ పథకాల గురించి సవివరంగా తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఎంతమంది కార్మికులు లబ్ధి పొందారో ఆరాతీశారు. అనంతరం కార్మిక శాఖ భవనం ఆవరణలో అసంఘటిత కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ అసంఘటిత కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో వేతన సవరణ చట్టం, హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1 5 1 0 0కు ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నామినేటెడ్ సభ్యుడు జి.తిరుపతి పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి మంజుల వీణ

పార్వతీపురం టౌన్: ఇంటర్మియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి మంజుల వీణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 12వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలకు సంబంధించి పరీక్షల నిర్వహణలో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గల 13 స్టోరేజీ పాయింట్లలో 17 పరీక్షా కేంద్రాల ప్రశ్నపత్రాలను భద్రపరచనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దర్యాప్తులో ఫోరెన్సిక్ ఆధారాలు ముఖ్యం

- మిమ్స్‌లో ఒకరోజు శిక్షణ



మిమ్స్‌లో జరిగిన శిక్షణలో సూచనలు ఇస్తున్న ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులు

విజయనగరం క్రైమ్: కేసుల దర్యాప్తులోను, నిందితులపై నమోదైన కేసుల్లో ఫోరెన్సిక్ ఆధారాలు చాలా ముఖ్యమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు దర్యాప్తు అధికారులకు మంగళవారం మిమ్స్‌లో ఫోరెన్సిక్ నిపుణులతో ఒక్కరోజు శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు ప్రియాంక, సుమాలిక, ప్రశాంతిలు దర్యాప్తు అధికారులకు ఆధారాలు సేకరించడంలో మెలకువలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ నేర స్థలం నుంచి ఆధారాలు సేకరించడంలో దర్యాప్తు అధికారులు సీరియస్‌గానే దృష్టి పెట్టాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులలో ఆధారాలు సేకరించడం, లేబిలింగ్ చేయడం కోర్టులో నిరూపించడం అత్యంత కీలకమని ఎస్పీ అన్నారు. ఆధారాలు సేకరించడంలో సిరాలజీ, ఫోరెన్సిక్ ఫిజిక్స్, డీఎస్ఏ, టాక్సికాలజీ, నార్కోటిక్, సైబర్, ఆడియో, వీడియో పరీక్షలకు పంపడంలో మెలకువలను ఫోరెన్సిక్ అధికారులు, దర్యాప్తు సిబ్బందికి తెలి యజేశారు. నేరస్థలం నుంచి వేలిముద్రలు సేకరించడం, మత్తు పదార్థాలు, మానవ అవయవాలు, విష పదార్థాలు, రక్త నమూనాలు, సెమన్, వెంట్రుకలు, ఉమ్ము, పాదముద్రలు, మెమరీ కార్డ్స్, సిమ్‌కార్డ్స్ వంటివి ఎలా సేకరించాలో? ఏవిధంగా భద్రపరచాలో ఫోరెన్సిక్ నిపుణులు ఈ ఒకరోజు శిక్షణలో దర్యాప్తు అధికారులకు తెలియజేశారు. అనంతరం నిపుణులను ఎస్పీ వకుల్ జిందల్ జ్ఞాపికలతో సత్కరించారు.

విద్యల నగరంలో బాలమేధావి



బాలమేధావి కునాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: సాధారణంగా చిన్నపిల్లలు వీడియో గేమ్స్ లేదా కంప్యూటర్ గేమ్స్‌తో కాలం గడుపుతారు. కానీ విజయనగరానికి చెందిన 1వ తరగతి చదువుతున్న ఐదేళ్ల బాలుడు గరుగుబెల్లి కునాల్ కష్టసాధ్యమైన జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ సులభంగా చెప్పేస్తున్నాడు. ది వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఫస్ట్ స్టాండర్డ్ చదువుతున్న కునాల్ 140కు పైగా దేశాలకు సంబంధించిన జాతీయ పతాకాలను అవలీలగా గుర్తుపట్టడమే గాక, వందకు పైగా దేశాలకు సంబంధించిన సమాచారాన్ని, వివిధ సముద్రాలు, వివిధ ఖండాలు, చారిత్రాత్మక యుద్ధాలు, ప్రదేశాలు, రాజధానులు తదితర అంశాలను అడిగిన వెంటనే చెప్పి అబ్బురపరిచాడు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం గురజాడ స్మారక గ్రంథాలయంలో బాలమేధావి కునాల్ ప్రదర్శన విజయవంతంగా ఇచ్చాడు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీతో కలిసి ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ బాలమేధావికి పతకాన్ని, బహుమతిని అందించి అభినందించారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ముళ్లపూడి సుభద్రాదేవి, గిరిజా ప్రసన్న, ఎం.చంద్రశేఖర్, బాలమేధావి తల్లిదండ్రులు అశోక్, రాజులమ్మ పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం: ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. నగరంలోని విజ్జి స్టేడియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 20 మంది జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విజయనగరం జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభ గల క్రీడాకారులకు విజయనగరం పెట్టింది పేరుగా వాఖ్యానించారు. ఎంతోమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రాధిక మంగిపూడి, ప్రధాన కార్యదర్శి సూర్యలక్ష్మి, ఉపాధ్యక్షులు కేఆర్‌కే రాజు, సహాయ కార్యదర్శి హరిగోపాల్, కోశాధికారి రవికుమార్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్, వి.ఆనంద కిశోర్, పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి చీరల్లో వెరైటీ చూపించాలి

- చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్



నారాయణపురంలో చేనేత కార్మికులకు సూచనలు ఇస్తున్న అధికారి

బలిజిపేట: చేనేత రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్ చెప్పారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో చేనేత కార్మికుల స్థితిగతులను మంగళవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి కొన్ని సూచనలు చేస్తూ బొబ్బిలి చీరలకు వెరైటీ కల్పించాలని సూచించారు. మహిళలు ఎక్కువగా ఇష్టపడే బుటా చీరలను తయారుచేసేందుకు ప్రయత్నించాలని కోరారు. రకరకాల చీరలను తయారుచేసేందుకు అవసరమైన సహాయసహకారాలు అందించనున్నట్లు చెప్పారు. చీరలు తయారుచేసేందుకు అవసరమైన మెటీరియల్ ఏమిటి? ఎక్కడ నుంచి వస్తుంది? ఇంకా ఎటువంటి మెటీరియల్ అవసరం, నైపుణ్యాలను పెంచాలంటే ఎటువంటి చర్యలు చేపట్టాలి? చేనేత రంగాభివృద్ధికి శాఖా పరమైన సహాయసహకారాలు ఎంతమేర అవసరం అనే విషయాలపై వారితో చర్చించి వారినుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మంచి నాణ్యమైన సరుకులు తయారుచేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, శ్రీకాకుళం ఎ.డి జనార్దన రావు, అసిస్టెంట్ డివిజనల్ అధికారి రమణ, చేనేత కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లికి పుష్పాలంకరణ



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆశవర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



తోణాం డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

సాలూరు రూరల్: ఆశావర్కర్లకు పనిభారం తగ్గించి కనీస వేతనం ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మర్రి శ్రీను అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆశ వర్కర్లు మే 20న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తెలియజేస్తూ బోగవలస, తోణాం, మామిడిపల్లి మెడికల్ ఆఫీసర్లుకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల సంఘం నాయకులు రాజేశ్వరి, శ్రీదేవి, త్రివేణి, సరోజిని ఆదిలక్ష్మి, రమణమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలు దాటుతూ మహిళ మృతి

తుని: నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్లో పట్టాలు దాటుతూ సాలూరి సంతోషి(37) మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. విజయనగరం జిల్లా మక్కువ మండలం తోటవలస గ్రామానికి చెందిన సంతోషి నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు విశాఖపట్నం కేజీహెచ్‌కు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని సొంత ఊరుకు వెళ్లేందుకు విశాఖ రైల్వేస్టేషన్‌కు వచ్చి, రాయగడ ఎక్స్‌ప్రెస్ అనుకుని గుంటూరు వెళ్లే రైలు ఎక్కింది. రైలులో ప్రయాణిస్తున్న సమయంలో సహచర ప్రయాణికుల ద్వారా గుంటూరు వెళుతుందని తెలుసుకుని నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్లో దిగింది. విశాఖపట్నం వెళ్లడానికి ఒకటో నంబరు నుంచి 2వ నంబరు ప్లాట్‌ఫాంకు వెళ్లడానికి పట్టాలు దాటుతున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుందన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అది 13వ శతాబ్దం నాటి శివలింగం



పురాతన శివలింగంను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ ఏడీ ఫల్గుణరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ అగ్రహారం శ్మశానవాటిక సమీపంలోని శివలింగం, దాని సమీపంలోని వివిధ ఆకృతులు కలిగిన రాతి విగ్రహాలను పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఫల్గుణరావు మంగళవారం పరిశీలించారు. శివ లింగంకు ఉపయోగించిన రాయి, దాని ఆకృతులును పరిశీలించి, శివలింగం 13వ శతాబ్దం నాటిదిగా పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని 6వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు తూర్పు గాంగులు పాలించారని, ముస్లింల దండయాత్రలో విగ్రహాలు ధ్వంసమయ్యాయన్నారు. గ్రామ సమీపంలో వెయ్యేళ్ల కిందటి మహిసాసుర మర్ధిని పాలరాతి విగ్రహం ఉందన్నారు. సర్పంచ్ రఘు మాట్లాడుతూ పురాతన శివ లింగం ఉన్న చోట ఆలయం నిర్మించాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. పురావస్తు సంపదను కాపాడుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కోట్ల సత్యంనాయుడు, లెంక రామునాయుడు, లెంక రాజినాయుడు, లెంక రామకృష్ణ, చందక అప్పలస్వామి, అప్పలనాయుడు, సీతంనాయుడు పాల్గొన్నారు.